## 515 క్రీస్తును గృహమున ప్రతిష్టించుట

రా –శహన (చాయ : విజయగీతముల్ పాడరె) తా–త్రిపుట

ప్రభువుగన్ ప్రతిష్టింపరే – గృహమున క్రీస్తున్ – ప్రభువుగా ప్రతిష్టింపరె = విభవమొందగ నతని – శుభమౌ నామము ధర సౌ – రభమును వెదజల్లగ – ప్రబలమౌ ప్రేమన్ – ప్రభుని యెడ గనపర్చరె ॥ప్రభువు॥

1. పూర్ణ ప్రేమను జూపరే – గృహమున క్రీస్తుకు – పూర్ణ ప్రేమను జూపరే = పూర్ణ హృదయముతోను – పూర్ణయాత్మతో – మరి ప్ర – పూర్ణ శక్తితో జూపరే – క్రీస్తునిలో సం –పూర్ణులగుటకు సాగరె ॥ప్రభువు॥
2. భక్తితోడను గొల్వరే – గృహమున క్రీస్తున్ – భక్తితోడను గొల్వరే = ముక్తినాధుడు తన స్వ – రక్తమియను మనకై – రిక్తుడాయెను జూడరే – ముక్తిదాతను నా – సక్తితో గొనియాడరే ॥ప్రభువు॥
3. నమ్మకస్థులై యుండరే – గృహమున క్రీస్తుకు – నమ్మకస్థులై యుండరే = అమ్మహాత్ముని నామ – మిమ్మహిన్ దగజాటన్ – నమ్మె మిమ్మును జూడరె – సమ్మతిన్ గ్రీస్తున్ – నమ్మకంబుగ జాటరె ॥ప్రభువు॥

–సి. విజయ చార్లెస్

## 516 క్రైస్తవ గృహము

రా –బిలహరి (చాయ : యేసునాధ కథా సుధారసము) తా–త్రిపుట

యేసుక్రీస్తుని దాసులారా – మీ సుతులకును నేర్పరె = ఆశతో యెహోవ యాజ్ఞల – నభ్యసింపగ జేయరే ॥యేసు॥

1. పిల్లలెప్పుడు ననుసరింతురు – తల్లిదండ్రుల నడతలన్ = ఎల్ల విషయము లందు మాదిరి – పిల్లలకు గనుపర్చరే ॥యేసు॥
2. మోదమిచ్చు కుటుంబ ప్రార్థన – నేదినంబును మానక = ఆదివారపు బడికి బిడ్డల – నాదరముతో బంపరే ॥యేసు॥
3. యేసునాధుని బోలు నాయకు – డే జగంబున లేడని = యేసు కే నిజ శిష్యులగుటకు – నేర్పరే యౌవనులకు ॥యేసు॥



4. యేసు సౌశీల్యమును వారికి – వాసిగా బోధింపరే = పసితనముననె వారి హృదయము – యేసురూపము దాల్చును ॥యేసు॥
5. యేసుక్రీస్తులో నిలిచి వారలు – యేపుమీర ఫలింపగా = యేసు వాక్యము వారి యెదలలో – నాశతోడను నాటరే ॥యేసు॥

పి.విజయ చార్లెస్

## 517 మాదిరి కుటుంబము

రా –ఖరహరప్రియ (చాయ : ప్రభువా పంపుమా) తా–ఆది

యెహోవ యందు – భక్తి – బహుగ గలిగియుండి = మహిమాధ్యుని మార్గంబులయందు – గృహముల నడుపు నరులే ధన్యులు ॥

1. దేవుని యందలి – భయము – దీనుల దీవించున్ = నీవు నీ జేతుల కష్టార్జితమును – నిత్యము ననుభవంతువు నిజముగ ॥
2. ఉల్లమలర భార్య – ద్రాక్షా – వల్లివలె ఫలించు = పిల్లలొలీవ మొక్కల చందము – పెంపొందుదు రెంతయు సొంపుగను ॥
3. దేవుని భక్తియే – నీ కిల – దీర్ఘాయువు నిచ్చుఁ = గావున నీ పిల్లల పిల్లలను గాంతువు ప్రభు కృపతోఁ వెలగుదువు ॥

–వేశపోగు గుల్బానమ్మ

## 518 క్రైస్తవుని ప్రతిజ్ఞ

రా –యమునా కళ్యాణి (చాయ : జీవితాంతమువరకు) తా–త్రిపుట

నేనును నా యింటివారును – నీతి సూర్యుని గొలుతుము = దీనమనసును గలిగి దేవుని – దివ్యసేవను జేతుము ॥

1. అనుదినంబును – ప్రభుని దలచుచు – అలయకను ప్రార్థింతుము = అనవరత మా ప్రభుని చిత్తము – ననుకరింతుము పనులలో ॥
2. వేదవాక్య పఠనమందు – విసుగు – జెందక నుందుము = ఆదరంబున దైవ చిత్తము – ననుసరించుచు నడుతుము ॥
3. ఆశతోడను ప్రభుని దినమును – నాచరింతుము మరువక = విసుకు జెందక నాలయమునకు – పిన్న పెద్దల దెత్తుము ॥